
సాక్షి
పల్నాడు
ఆదివారం । 11 । మే । 2025



సాగర్ నీటిమట్టం


విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 513.40 అడుగుల వద్ద ఉంది. ఇది 137.5158 టీఎంసీలకు సమానం.



వైభవంగా బ్రహ్మోత్సవాలు

పొన్నూరు: పట్టణంలోని సాక్షి భావన్నారాయణ స్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శనివారం స్వామివారు కృష్ణావతారంలో దర్శనమిచ్చారు.

బ్రహ్మంగారి తిరునాళ్ల



రెంటచింతల: పశర్లపాడు గ్రామంలో శనివారం బ్రహ్మంగారి తిరునాళ్ల వేడుకలను వైభవంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

న్యూస్‌రీల్

త్రికోటేశ్వరస్వామికి రేపు లక్ష మల్లెల పూజ

నరసరావుపేట రూరల్: కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామికి ఈనెల 12వ తేదీ సోమవారం సాయంత్రం 5 గంటల నుంచి నిర్వహించే లక్ష మల్లెల పూజకు వేలాదిగా భక్తులు హాజరై స్వామివారి కృపాకటాక్షాలు పొందాలని ఆలయ కార్యనిర్వాహణాధికారి డి.చంద్రశేఖర రావు శనివారం ఒక ప్రకటనలో కోరారు. దాతల సహకారంతో ప్రతి ఏడాది వైశాఖ పూర్ణమి రోజున ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.

హైకోర్టు న్యాయమూర్తిని కలిసిన ఉద్యోగ సంఘం నేతలు



గుంటూరు లీగల్: గుంటూరు జిల్లా పోర్టుఫోలియో జడ్జి, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జయసూర్యను న్యాయశాఖ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర, గుంటూరు నగర సంఘ కార్యవర్గ సభ్యులు మర్యాదపూర్వకంగా కలసి అభినందనలు తెలిపారు. గుంటూరు జిల్లా కోర్టులో శనివారం జరిగిన జ్యుడీషియల్ ఆఫీసర్స్ వర్క్‌షాప్‌నకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జయసూర్య హాజరయ్యారు. న్యాయమూర్తిని కలసిన వారిలో న్యాయశాఖ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు రామరాజు చంద్రశేఖర్, నగర అధ్యక్షుడు రాచకొండ శ్రీనివాసరావు, కార్యదర్శి సాంబ్రా బైరాగి, సంఘ సభ్యులు ఉన్నారు.

మల్లేశ్వరస్వామి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



పెదకాకాని: ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి మల్లికార్జునరావు దంపతులు శనివారం పెదకాకానిలోని భ్రమరాంబ మల్లేశ్వరసామి ఆలయానికి విచ్చేశారు. న్యాయమూర్తి దంపతులకు ఆలయ ఉప కమిషనరు గోగినేని లీలాకుమార్, అర్చక స్వాములు, వేదపండితులు వేద మంత్రోచ్చారణల నడుమ మేళతాళాలతో సాదర స్వాగతం పలికారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేసిన వారు భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక అభిషేకం, కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. అనంతరం అర్చకస్వాములు, వేదపండితులు వేద ఆశీర్వచనం అందించారు. న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జున రావు దంపతులను స్వామి వారి శేషవస్త్రంతో సత్కరించి స్వామి వారి చిత్రపటం, ప్రసాదములను డీసీ అందజేశారు.

నేడు రెడ్ల రామమందిరం పునర్నిర్మాణానికి శంకుస్థాపన

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని ఉండవల్లి గ్రామంలో వేంచేసి ఉన్న రెడ్ల రామమందిరం పునః నిర్మాణ శంకుస్థాపన మహోత్సవాన్ని ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8.20 గంటలకు జరిగే ఈ శంకుస్థాపన కార్యక్రమాల్లో భక్తులందరూ పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

అంగన్‌వాడీ కేంద్రంలో మదర్స్‌డే వేడుకలు



గుంటూరు రూరల్: తల్లి స్థానాన్ని ఎవ్వరూ భర్తీ చేయలేరని ఐసీడీఎస్ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ కేవీఎస్ విజయలక్ష్మి అన్నారు. మండలంలోని జొన్నలగడ్డ గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం మదర్స్‌డే వేడుకలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ తల్లులు ఆరోగ్యంగా ఉంటే బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. ప్రతి తల్లి, గర్భిణి ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సక్రమంగా వినియోగించుకుని ఆరోగ్యకరమైన బిడ్డలకు జన్మనివ్వాలన్నారు. అనంతరం కేక్ కట్‌చేసి స్వీట్లు పంచారు. కార్యక్రమంలో మోడల్ ఆఫీసర్ శ్రీవాణి, ప్రత్తిపాడు ప్రాజెక్ట్ సీడీపీవో విజయనిర్మల, సూపర్‌వైజర్ వెంకటరత్నం, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు గర్భిణులు తదితరులు పాల్గొన్నారు.

భూమాతకు నవ రక్ష

- పీఎండీఎస్‌తో వేరు వ్యవస్థకు భద్రత
- 20 నుంచి 30 విభిన్న జాతుల విత్తనాలతో కిట్
- 132 గ్రామాల్లో ప్రకృతి సాగుకు సిద్ధం

నవధాన్యాల సాగుతో భూసారం పెంపు



నవధాన్యాలతో తయారు చేసి పంపిణీకి సిద్ధంగా ఉన్న కిట్లు

ముప్పాళ్ళ: నవధాన్యాల సాగుతో భూమి సారవంతంగా మారుతుంది. రుతుపవనాలు రాకముందే ప్రధాన పంటకు ముందు నవధాన్యాల సాగు చేపట్టడం ద్వారా భూమిని రక్షించుకోవచ్చని వ్యవసాయశాఖ అధికారులు విస్తృత ప్రచారం చేపట్టారు. నవధాన్యాల సాగు – నేలతల్లి బాగు అనే పేరుతో అధికారులు ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నారు. బహుళ పంటల సాగుకు అండగా నిలవడం, భూసారాన్ని పెంచడం, ప్రజలకు ఆరోగ్యకరమైన ఉత్పత్తులు అందించడం ఈ సాగు ఉద్దేశం. ఈ సాగు భూమిలోని సేంద్రియ కర్బనం పెంపుతో పాటుగా చీడ పీడల బెడద తగ్గుతుందని వివరిస్తున్నారు.

విభిన్న జాతుల విత్తనాలతో కిట్

ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ (పీఎండీఎస్) అనేది పంట కాలానికి సంబంధం లేకుండా ప్రధాన పంటకు ముందు 20 నుంచి 30 రకాల వివిధ పంట విత్తనాలను కలిపి వెదజల్లుతారు. 365 రోజులు భూమి పంటలతో కప్పబడి ఉండాలనే వ్యూహంతో ఈ సాగుపద్ధతిని అవలంబిస్తారు. పప్పు ధాన్యాలు, నూనె, తీగజాతి, చిరుధాన్యాలు, తృణ ధాన్యాలైన పెసర, మినుము, నువ్వులు, వేరుశగన, రాగులు, కందులు, జొన్నలు వంటి 30 రకాల వివిధ జాతుల విత్తనాలు కిట్‌లో ఉంటాయి. ఈ కిట్లు డ్వాక్రా మహిళా సంఘాల ద్వారా గ్రామాల్లో తయారు చేయించి రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు అందిస్తున్నారు.

సాగుతో ఉపయోగాలు...

పీఎండీఎస్ పద్ధతిలో వివిధ పంటల వేర్లు భూమిలో వైవిధ్య రకాల సూక్ష్మజీవులకు ఆశ్రయం కల్పించి పంటలకు ఉపయోగపడే వీటి సంతతిని అభివృద్ధి చేస్తాయి. తద్వారా ప్రధాన పంటకు కావాల్సిన స్థూల, సూక్ష్మ పోషకాలను అందుబాటులోకి తీసుకువచ్చి మొక్కల వేరు వ్యవస్థ గ్రహించేట్లు చేస్తాయి. నవధాన్య పంటలు పశువులకు పోషక విలువలతో కూడిన పచ్చిమేతగా ఉపయోగపడతాయి. నేల గుల్ల బారి వాన పాములు వృద్ధి చెందుతాయి. నిల్వ సామర్థ్యం పెరుగుతుంది. పలు పంటల సాగు వల్ల అదనపు ఆదాయం కలుగుతుంది.

82,823 ఎకరాల సాగు లక్ష్యం

జిల్లా ప్రకృతి వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో గ్రామాల వారీగా నవధాన్యాల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ విధానం అమలు చేసేందుకు ప్రత్యేకంగా ప్రతి సబ్‌డివిజన్ కు ఒక మాస్టర్‌ట్రైనర్‌ను నియమించారు. జిల్లా వ్యాప్తంగా ఆరు డివిజన్‌లలో 132 గ్రామాల్లో 46,368 మంది రైతులతో 82,823 ఎకరాల్లో నవధాన్య సాగును లక్ష్యంగా పెట్టుకొన్నారు. ఇప్పటివరకు జిల్లాలో మొత్తం 29,628 కిట్లు తయారీ చేసి రైతు సేవా కేంద్రాల్లో రైతులకు అందుబాటులో ఉంచారు. 18,894 కిట్లు రైతులకు పంపిణీ చేశారు. ఇప్పటికే 8,360 ఎకరాల విస్తీర్ణంలో పీఎండీఎస్ నవధాన్యాల సాగు చేశారు.

నవధాన్యాల సాగు లాభదాయకం..



నవధాన్యాల సాగు వలన భూమిలో జీవ వైవిధ్యం పెరిగి ప్రధాన పంటకు కావాల్సిన పోషకాలు వృద్ధి చెంది రైతులకు ఎంతో లాభదాయకంగా ఉంటుంది. పర్యావరణానికి మేలు జరుగుతుంది. ప్రధాన పంటకు ఎరువులు, పురుగుమందులు వాడకుండా పేడ, మూత్రం, సహజసిద్ధమైన అవశేషాలు వాడటం వలన ఖర్చు తగ్గి ఆదాయం పెరుగుతుంది. ఆరోగ్యకర వ్యవసాయ ఉత్పత్తులను పండించవచ్చు.

కె.అమలకుమారి, ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్

రెండెకరాల్లో సాగు చేశా..



గత ఏడాది రెండెకరాల్లో నవధాన్యాల సాగు చేశా. ఏప్రిల్‌లో సాగు చేస్తే మే నెలలో కోతకు వచ్చింది. పశువులకు మేతగా సెంటు రూ.100 చొప్పున అమ్మితే రూ.20వేలు ఆదాయం వచ్చింది. మళ్లీ మిరప, మొక్కజొన్న సాగు చేశాం. అదనపు ఆదాయం వచ్చింది.

– కాకుమాను పూజ, ప్రకృతి సేద్యం విలేజ్ యూనిట్ ఇన్‌చార్జ్, నార్నెపాడు

చూసిన కనులదే భాగ్యము..!



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

- వైభవంగా లక్ష్మీనరసింహ స్వామి కల్యాణోత్సవాలు
- అధికసంఖ్యలో పాల్గొన్న భక్తులు

గురజాల: పల్నాడు ప్రాంతం యాదాద్రిగా పేరుగాంచిన శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. నగర పంచాయతి పరిధిలోని జంగమహేశ్వరపురంలో వేంచేసియున్న శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం కల్యాణం నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ స్వామి కల్యాణం నిర్వహించారు. ముందుగా ప్రభాతసేవ, అభిషేకం, కుంకుమార్చన తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాలు ఎంతో ఉత్సాహభరితంగా జరిగాయి. స్వామివార్లను పీఠంపై అధిష్టింపచేసి కల్యాణ మండపానికి ఊరేగింపుగా తీసుకువచ్చారు. స్వామివారి కల్యాణంలో దంపతులు పీట్లపై కుర్చున్నారు. కల్యాణం తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. దేవాలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. అన్న ప్రసాద కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పలు చర్యలు చేపట్టారు.

దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే కాసు

స్వామివారిని మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామి కటాక్షం ప్రతి ఒక్కరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఎటువంటి ఇబ్బందులు రాకుండా ప్రతి ఒక్కరూ ఆనందంగా జీవించాలని వేడుకున్నట్లు తెలిపారు. తొలుత దేవాలయం సమీపంలో నూతనంగా నిర్మాణం చేపట్టిన వాహన శాల, ఆఫీసు రూం, ఆలయ అర్చకుడికి నివాస గది, అన్నదానం నిర్వహించేందుకు గాను రేకుల షెడ్డూ గదిని ప్రారంభించారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు యెనుముల మురళీధర్‌రెడ్డి మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డిని దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. సీనియర్ నాయకుడు కొమ్మినేని వెంకటేశ్వర్లు (కేవీ) పట్టణ కన్వీనర్ కె.అన్నారావు, కౌన్సిలర్ పోలు వీరారెడ్డి, వేలమూరి సైదారెడ్డి, ఇందుకూరి సుబ్బారెడ్డి, షేక్ నాసర్ సైదా, వి.అమరారెడ్డి, బి.ఇష్టకామిరెడ్డి తదితరులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



స్వామివారిని మండపానికి తీసుకువస్తున్న యెనుముల మురళీధర్‌రెడ్డి తదితరులు



నూతన గదులను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

త్వరితగతిన శిక్షలు పడేలా చూడండి

కోర్టు కానిస్టేబుళ్ల సమావేశంలో జిల్లా ఎస్పీ



మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాసరావు

నరసరావుపేట: న్యాయస్థానాల్లో హత్య, హత్యాయత్నం, ఎన్‌డీపీఎస్, పోక్సో, లైంగిక వేధింపుల కేసుల్లో నిందితులు, రౌడీషీటర్లకు త్వరితగతిన శిక్షలు పడేవిధంగా కోర్టు కానిస్టేబుళ్లు సమర్థవంతంగా వ్యవహరించాలని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు సూచించారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో కోర్టు కానిస్టేబుళ్ళతో నిర్వహించిన సమావేశంలో పాల్గొని పలు సూచనలు ఇచ్చారు. జిల్లాలోని అన్నీ పోలీస్‌స్టేషన్లకు సంబంధించి వివిధ న్యాయస్థానాల్లో విచారణలో ఉన్న కేసుల విచారణను వేగవంతం చేసేందుకు తగిన ప్రణాళికలు రూపొందించాలన్నారు. సంబంధిత పోలీస్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ తగిన సాక్ష్యాధారాలను సమర్పించి నిందితులకు త్వరితగతిన శిక్షలు పడే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వివిధ కేసుల్లోని నిందితులు, రౌడీషీటర్ల హాజరు, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న నాన్ బెయిలబుల్ వారంట్ల జారీపై శ్రద్ధ వహించి, వాటి అమలును వేగవంతం చేయాలన్నారు. నిందితుల జాడ తెలియని పక్షంలో ష్యూరిటీలను కోర్టుకు హాజరు పరచి తద్వారా జరగవలసిన ప్రక్రియను చేపట్టాలన్నారు. గత నెలలో ఆయా న్యాయస్థానాల్లో పలు కేసులకు సంబంధించి వచ్చిన తీర్పులు, నిందితులకు పడిన శిక్షలపై హర్షం వ్యక్తం చేశారు. అదనపు ఎస్పీ జేవీ సంతోష్, డీసీఆర్‌బీ సీఐ ఎం.శ్రీనివాస రావు, కోర్టు కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్లు, ఏఎస్ఐలు పాల్గొన్నారు.

సాయానికి వెళ్లి.. చావు బతుకుల్లోకి..

- చోరీ కేసులో బైక్ రికవరీకి వెళ్లి వస్తుండగా ప్రమాదం
- సహాయంగా వచ్చిన వ్యక్తికి తీవ్రగాయాలు.. హోంగార్డుకు గాయాలు



తీవ్రగాయాలపాలైన బ్రహ్మంను ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

పెదకూరపాడు: సాయం చేసేందుకు వెళ్లిన వ్యక్తి ప్రమాదానికి గురై చావుబతుకుల్లో కొట్టుమిట్టాడుతున్న సంఘటన మండలంలోని లగడపాడు గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదకూరపాడు గ్రామానికి చెందిన గుంటూరు నాగేశ్వరరావుకు చెందిన ద్విచక్ర వాహనం గత ఏడాది పెదకూరపాడులో చోరీకి గురైంది. ఈ విషయమై పెదకూరపాడు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో బైక్‌లు చోరీలకు పాల్పడుతున్న పలువురిని గత నెల 19వ తేదీన అచ్చంపేట పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద దొరికిన వాహనాల్లో నాగేశ్వరరావు వాహనం సైతం ఉండటంతో రికవరీకి శనివారం పెదకూరపాడు పోలీసుస్టేషన్ పీఎస్ హోంగార్డు గుజ్జర్లపూడి రాజేష్‌ఖన్నాతో కలసి నాగేశ్వరరావు వెళ్లాడు. ఆయనకు సహాయంగా పెదకూరపాడుకు చెందిన బత్తుల బ్రహ్మం తన ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. వారు అచ్చంపేట వెళ్లి రికవరీ చేసిన వాహనం రిపేరులో ఉండడంతో దాన్ని వెంట తీసుకెళ్లిన వాహనానికి తాడు కట్టి ఒక వాహనంపై నాగేశ్వరరావు, హోంగార్డులు.. రికవరీ అయిన వాహనంపై గోరంట్ల బ్రహ్మం ఎక్కి తీసుకు వస్తున్నారు. ఈక్రమంలో పెదకూరపాడు మండలం లగడపాడు వద్ద ట్రాక్టర్ ఎదురు రావడంతో అదుపు తప్పి ముగ్గురు రోడ్డు పక్కనున్న కందకంలో పడ్డారు. వారిపై రెండు బైకులు పడ్డాయి. ఘటనలో బ్రహ్మం తలకు తీవ్రగాయాలయ్యాయి. పెదకూరపాడు సీహెచ్‌సీలో ప్రథమ చికిత్స అనంతరం, గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉంది. హోంగార్డు రాజేష్‌ఖన్నాకు కుడి కాలికి గాయమైంది. ఆయన్ను సత్తెనపల్లి వైద్యశాలకు తరలించారు. వాహన సొంతదారుడు నాగేశ్వరరావుకు స్వల్పగాయాలయ్యాయి.

తెల్లారిన బతుకులు

- రోడ్డు ప్రమాదంలో ముగ్గురు కూలీలు దుర్మరణం
- తిమ్మరాజుపాలెం జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం
- రోడ్డు క్రాస్ చేస్తూ అదుపుతప్పి బోల్తాపడ్డ గ్రానైట్ లారీ
- డ్రైవర్, క్లీనర్‌లకు స్వల్ప గాయాలు



తాళ్లూరి ప్రభుదాసు(ఫైల్)



పాలపర్తి శ్రీను (ఫైల్)



సురేంద్రబాబు (ఫైల్)



సురేంద్రబాబు మృతదేహం

పర్చూరు(చినగంజాం): రాత్రి వేళ పనిచేస్తే అధిక కూలి వస్తుందని ఆశించారు...కానీ ఆ రాత్రే వారికి చివరి రాత్రి అవుతుందని అనుకోలేదు...లారీ రూపంలో ఎదురు వచ్చిన మృత్యువు వారి ప్రాణాలను కబళించింది. గ్రానైట్ పలకల లోడుతో వెళుతున్న లారీపై కూర్చున్న ముగ్గురు కూలీలు వాటి కింద పడి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ దుర్ఘటన పర్చూరు మండలం తిమ్మరాజుపాలెం జాతీయ రహదారిపై శనివారం వేకువజామున జరిగింది. బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మార్టూరులో గ్రానైట్ పలకల లోడుతో శనివారం వేకువజామున ఓ లారీ గుంటూరు బయలుదేరింది. గుంటూరు వెళ్లెందుకు డ్రైవర్ మస్తాన్‌వలి లారీని పర్చూరు వైపు మళ్లించాడు. తిమ్మరాజుపాలెం వద్ద రోడ్డు క్రాస్ చేస్తుండగా ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి సడెన్ బ్రేక్ వేయడంతో లారీ ఒక్కసారిగా బోల్తా కొట్టింది. లారీపై కూర్చొని ఉన్న ముగ్గురు కూలీలు గ్రానైట్ పలకల కింద పడి అక్కడికక్కడే మృతి చెందారు. మృతి చెందిన వారిలో మార్టూరుకు చెందిన పాలపర్తి శ్రీను (25), తాళ్లూరి ప్రభుదాసు (43), పర్చూరు మండలం నూతలపాడుకు చెందిన తమ్మలూరి సురేంద్ర బాబు(28)గా గుర్తించారు. డ్రైవర్ మస్తాన్‌వలి, క్లీనర్ రమేష్‌లు స్వల్పగాయాలతో ప్రమాదం నుంచి బయటపడ్డారు. ప్రమాద సమాచారం అందుకున్న బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు, పర్చూరు ఎస్ఐ మాల్యాద్రి హుటాహుటిన తమ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. గ్రానైట్ పలకలను తొలగించి మృతదేహాలను వెలికి తీశారు. రెవెన్యూ అధికారులు సునీత, యార్లగడ్డ శ్రీనివాస రావు, విజయ్ ఆధ్వర్యంలో శవ పంచనామాల అనంతరం మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పర్చూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు ప్రమాదానికి గల కారణాలపై దృష్టి సారించారు.

అధిక గ్రానైట్ లోడే ప్రమాదానికి కారణం?

లారీలో అధిక గ్రానైట్ పలకల లోడు వేయడం ప్రమాదానికి కారణమై ఉంటుందని పలువురు భావిస్తున్నారు. సామర్థ్యానికి మించి గ్రానైట్ పలకల లోడు లారీలో ఉన్నట్లుగా సమాచారం. రోడ్డు క్రాస్ చేసే సమయంలో ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో లారీ బోల్తా కొట్టిందని భావిస్తున్నారు.

పర్చూరు వైపు లారీ ఎందుకు మళ్లింది?

మార్టూరులో గ్రానైట్ పలకలను లోడు చేసుకున్న లారీ నేరుగా గుంటూరు వెళ్లాల్సి ఉండగా పర్చూరు వైపు ఎందుకు మళ్లించారనే దానిపై అనుమానం వ్యక్తమవుతున్నాయి. గ్రానైట్ లోడుకు సంబంధించి సరైన పత్రాలు ఉన్నాయా? లేవా? అనే అనుమానాలను పలువురు వ్యక్త పరుస్తున్నారు. దీనికి సంబంధించి పూర్తి సమాచారం పోలీసుల విచారణ అనంతరం బయటకు వచ్చే అవకాశం ఉంది.

ముగ్గురూ బంధువులే..

ప్రమాదంలో మృతిచెందిన ముగ్గురూ బంధువులే. పాలపర్తి శ్రీను, మృతుడు సురేంద్రబాబులు బావ మరుదులు. సురేంద్రబాబు భార్య రాణి స్వయనా శ్రీను అక్క. శ్రీను, ప్రభుదాసు సమీప బంధువులే. ప్రమాదంలో మృతి చెందిన ముగ్గురూ ఇలా సమీప బంధువులు కావడం గమనార్హం.

మృతులంతా పేదలే..

ప్రమాదంలో మృతి చెందిన వారంతా మార్టూరు, నూతలపాడు ఎస్సీ కాలనీకి చెందిన పేద కుటుంబాల వారు. రాత్రి వేళ గ్రానైట్ లోడు చేసేందుకు వెళితే అధిక కూలి గిట్టుబాటు అవుతుందని ఆశించి వెళ్లిన వారే. కాగా మార్టూరులో గ్రానైట్ లోడు ఎక్కించడం మరలా గుంటూరు వెళ్లి లోడును దించి రావడం వరకు వారే స్వయంగా ఉంటారు. రోడ్డు ప్రమాదంలో వారు మృతి చెందడంతో ఆయా గ్రామాల కాలనీల్లో తీవ్ర విషాదం నెలకొంది. కూలి కోసం వెళ్లి మృత్యుఒడిలోకి జారుకోవడంతో బంధువులు, కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు. మార్టూరు అంబేడ్కర్ కాలనీకి చెందిన తాళ్లూరి ప్రభుదాసు ముగ్గురు ఆడపిల్లల తండ్రి. అతడి భార్య మరియమ్మ కాగా, కుటుంబ బాధ్యత అంతా ప్రభుదాసుపైనే ఉంది. కూలి పని చేసి సంపాదిస్తేనే వారి కుటుంబం గడిచేది. కానీ ఆయన ఆకస్మిక మరణంతో కుటుంబ సభ్యులకు దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. పాలపర్తి శ్రీను అదే కాలనీకి చెందిన వాడు కాగా అవివాహితుడు. అతని తండ్రి పేరయ్యతో కలిసి ఉంటున్నాడు. పర్చూరు మండలం నూతలపాడు ఎస్సీ కాలనీకి చెందిన తమ్మలూరి సురేంద్రబాబు తల్లిదండ్రులు చంద్రం, మేరీలు కాగా భార్య రాణి. ఆమె కూడా కూలి పనులకు వెళ్లి వస్తుంటుంది. వీరికి ఇద్దరు మగపిల్లలు కాగా వీరిద్దరు కూలి పనులకు వెళ్లి తీసుకొచ్చిన సంపాదనతో కుటుంబాన్ని పోషించుకుంటున్నారు.



ప్రభుదాసు మృతదేహం

రేపటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

గుంటూరు జిల్లాలో 51 పరీక్ష కేంద్రాలు

గుంటూరు ఎడ్యుకేషన్: సోమవారం నుంచి జరగనున్న ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు జిల్లాలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. జిల్లా వ్యాప్తంగా హాజరు కానున్న 27,162 మంది విద్యార్థులకు 51 పరీక్ష కేంద్రాలను అధికారులు సిద్ధం చేశారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరగనున్న ప్రథమ సంవత్సర పరీక్షలకు 23,279 మంది హాజరు కానున్నారు. మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు ద్వితీయ సంవత్సర పరీక్షలకు 3,883 మంది హాజరు కానున్నారు. పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆర్ఐవో జీకే జుబేర్ తెలిపారు. పరీక్షల నిర్వహణపై చీఫ్ సూపరింటెండెంట్లు, శాఖాధికారులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి నియమ, నిబంధనలపై అవగాహన కల్పించినట్లు చెప్పారు.

నృసింహునికి లక్ష పుష్పార్చన

మంగళగిరి టౌన్ : స్థానిక శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో జయంత్యుత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం ఆలయ ముఖ మండపంపై నరసింహస్వామికి ఆలయ అర్చకులు లక్ష పుష్పార్చన భక్తుల సమక్షంలో కనులవిందుగా నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. గులాబి, చేమంతి, బంతి, మల్లెలు, తులసీ దళాలతో పుష్పార్చన గావించారు. రాత్రి చతుర్వేద పారాయణ నిర్వహించారు. పుష్పార్చన వల్ల పాపాలు తొలగించి మంచి ఫలితాలు పొందవచ్చని అర్చకులు వివరించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ఏర్పాట్లను ఆలయ కార్యనిర్వహణాధికారి రామకోటిరెడ్డి పర్యవేక్షించారు.



పుష్పాలంకారంలో స్వామి

క్లుప్తంగా

రేపు జిల్లా రెజ్లింగ్ క్రీడాకారుల ఎంపికలు

అచ్చంపేట(క్రోసూరు): పల్నాడు జిల్లాస్థాయి రెజ్లింగ్ క్రీడాకారుల ఎంపికలు సోమవారం అచ్చంపేటలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో జరుగుతాయని జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ కార్యదర్శి గుడిపూడి భూషణం శనివారం తెలిపారు. రెజ్లింగ్ ఎంపికల గురించి వివరిస్తూ అండర్-17 విభాగంలో బాలుర, బాలికల ఎంపికలు జరుగుతాయని వారు 2008, 2009, 2010 సంవత్సరాలలో పుట్టిన వారై ఉండాలన్నారు. 2010లో పుట్టినవారు మెడికల్ సర్టిఫికెట్, పేరంటల్ సర్టిఫికెట్ సమర్పించాలన్నారు. అండర్-23 విభాగంలో పురుషులు, స్త్రీల ఎంపిక జరుగుతుందన్నారు. వీరు 2002 నుంచి 2006 సంవత్సరాలలో పుట్టి ఉండాలన్నారు. 2006లో పుట్టినవారు మెడికల్ సర్టిఫికెట్, పేరంటల్స్ సర్టిఫికెట్ అందజేయాలన్నారు. ఎంపికల్లో పాల్గొనదలచినవారు ఈనెల 12 ఉదయం 10 గంటలకు గురుకుల కళాశాలలో ఆధార్ జిరాక్స్ కాపీ, ఒరిజనల్ కార్డు, మెడికల్, పేరంటల్ సర్టిఫికెట్లు తీసుకోని రావాలన్నారు. ఎంపికైన వారు ఈనెల 16,17,18 తేదీల్లో చిత్తూరు జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు.

మద్యం తాగిన వ్యక్తి మృతి

మార్టూరు: మద్యం సేవించి అపస్మారక స్థితిలోకి చేరుకున్న వ్యక్తి మృతి చెందిన సంఘటన మార్టూరులో శనివారం జరిగింది. స్థానిక నాగరాజు పల్లి రోడ్డులో గల వైన్స్ షాపు వద్ద మార్టూరు రాంనగర్ కాలనీకి చెందిన మాదపాటి దానియేలు (35) మధ్యాహ్నం వెళ్లి మద్యం సేవించి షాపు సమీపంలో బండపై పడుకున్నాడు. మద్యం మత్తులో దాహంతో గొంతు ఎండిపోయిన దానియేలు ఉలుకూ, పలుకు లేకుండా అపస్మారక స్థితిలో ఉండిపోయాడు. మొదట గుర్తు తెలియని వ్యక్తిగా భావించిన స్థానికులు అతడిని స్థానిక ప్రభుత్వాసుత్రికి తరలించారు. దానియేలును పరీక్షించిన వైద్యులు అప్పటికే అతను మృతి చెందినట్లు తెలిపారు. మృతుడిని గుర్తించిన ఆసుపత్రి సిబ్బంది అతని బంధువులకు సమాచారం అందించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

‘ఓడు’ పోయిన మట్టి బతుకులు

- కడుపు నింపని చేతివృత్తి
- మృణ్మయ కళాకారుల జీవితం.. శ్రమకు దక్కని ఫలం
- మట్టికుండల చల్లదనం వెనుక శ్రామికుల స్వేదం
- కష్టాలను భరిస్తూ సంప్రదాయ చేతివృత్తిని కొనసాగిస్తున్న శాలివాహనులు

మట్టి పరిమళం వారికి జీవనశ్వాస... మట్టితో ముడిపడిన జీవితాలవి...తోటి మనుషులను నమ్మినా లేకున్నా మట్టిని ప్రేమిస్తారు. చేతివృత్తుల్లో ఒకటైన మట్టి పాత్రల తయారీలో ‘కులవృత్తికి సాటిరాదు గువ్వలచెన్నా’ అనుకుంటూ మమేకమైన దృశ్యం అక్కడ గోచరిస్తుంది. ఇంటిల్లిపాదికీ అది నిత్యం శ్రామిక జీవన సమరమే. వారు చిందించే స్వేదం నుంచే మట్టి కుండ రూపుదిద్దుకుని, అందులోని నీటి చల్లదనం దాహార్తులను సేదదీరుస్తుంది. మట్టికి అందమైన ఆకృతినివ్వగల ఆ మృణ్మయ కళాకారులు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నారు.

తెనాలి: గుంటూరు జిల్లాలో పది గ్రామాల్లో 350 పైగా కుటుంబాలు వంశపారంపర్యంగా వస్తున్న మట్టి పాత్రల తయారీలో దశాబ్దాలుగా కొనసాగుతున్నాయి. శలపాడు, గరువుపాలెం, కొలకలూరు, కావూరు, చింతాయపాలెం, మంగళగిరి, శృంగారపురం, తుమ్మలపాలెం, కొండవీడు, కోటప్పకొండ పరిసరాల్లో ఈ కుటుంబాలున్నాయి. పెళ్లి రోజున గరిక పాత్ర నుంచి పేదవాడి ఫ్రిజ్‌లుగా పిలుచుకునే కుండలు, కూజాలు, వంట పాత్రలు, పూలుకుండీలు, ప్రమిదెల సహా రకరకాల అవసరాల కోసం వాడే పాత్రల తయారీలో సిద్ధహస్తులు. ఏడాదిలో వేసవి కాలం మాత్రమే మట్టి పాత్రలకు గిరాకీ ఉంటుందని తెలిసిందే. మనిషి జీవితంలో ప్రవేశించిన ఆధునికత వీరి వృత్తికి కష్టకాలం తీసుకొచ్చి ంది. వేసవిలో అకాల వర్షాలు సంభవిస్తే వారి కష్టమంతా నీటిపాలవుతుంది. అన్నింటినీ భరిస్తూ కొనసాగిస్తున్న వారసత్వ చేతివృత్తిలో కళాత్మకత అబ్బురపరుస్తుంది.

దొరకని మట్టి

వృత్తికి ప్రధానమైన మట్టి లభ్యత సమస్యగా మారింది. ట్రక్కు రూ.5 వేలు పెట్టినా అనువైనది దొరకడం కష్టంగా ఉంది. వడ్లమూడి క్వారీ ఆపడంతో వీరికి నాణ్యమైన మట్టి కోసం పలుచోట్ల వెతుకులాట తప్పనిసరైంది. టన్ను పుల్లలు రూ.5 వేలు, పొలం పొట్టు రూ.5 వేలు చొప్పున మొత్తం రూ.20 వేల వ్యయంతో ఏటా సంక్రాంతి తర్వాత జనవరి నెలాఖరులోపు అవసరమైనవి సమకూర్చుకుంటారు. ముందుగా మట్టిని ఎండబెట్టి, నలగ్గొట్టి, గాబులో పోసి వడపోసిన మట్టిని పాత్రల తయారీకి వినియోగిస్తారు. ఈ పనిలో ఇంటావిడ శ్రమిస్తే, మట్టిని అందమైన పాత్రలుగా మలచే పనిని ఇంటాయన చేస్తుంటారు.

ఇరుగుపొరుగు సాయంతో ఆము ఏర్పాటు

పదిహను, ఇరవై రోజులు మట్టి పాత్రలు చేశాక వాటిని ఎండలో ఆరబెడతారు. తర్వాత ఒకరోజు ఇరుగుపొరుగు సాయంతో ఆము పెట్టుకుంటారు. సాయంత్రం పూట ఏడెనిమిది మంది కలిసి రెండు గంటలసేపు శ్రమిస్తే గాని ఆము తయారుకాదు. పగిలిన కుండలను చుట్టూ పేర్చుకుని, వాటిపైన ఆరబెట్టిన కుండలను భద్రంగా అమర్చుకుంటూ, అయిదారు వరుసలతో అన్నింటినీ సర్దుతారు. పగిలిన కుండపెంకులతో పైన కప్పును రూపుదిద్దుతారు. దిగువన కట్టెపుల్లలు, పొలం పొట్టు, ఊక ఏర్పాటు చేస్తారు. కాల్చిన పిడకలను చుట్టూ ఖాళీల్లో సర్దుతారు. ఆ పిడకలు రగులుకొని, ఊక, పొలం పొట్టుతో సహా కట్టెపుల్లలను మండించి, లోపలున్న మట్టిపాత్రలను ఎర్రగా కాలుస్తాయి.



ఆరబెట్టిన మట్టికుండల కాల్పుకు ఆము ఏర్పాటు



విద్యుత్ మోటారు అమర్చిన సారెపై కుండ తయారీ

ఉదయాని కల్లా ‘రెడీ టు సేల్’

మట్టి పాత్రల తయారీలో సంప్రదాయ విధానాలకు మృణ్మయ కళాకారులు కూడా ఆధునిక సాంకేతికతను అందుకున్నారు. పాత్రల తయారీ కోసం ముందుగా మట్టిని కలిపి పాకంగా చేయాలి. గతంలో ఇందుకోసం గంటన్నరపాటు కాళ్లతో తొక్కేవారు. ఇప్పుడు పది నిముషాల్లోనే విద్యుత్ మిషను మట్టి పాకాన్ని సిద్ధం చేస్తోంది. మరోవైపు చక్రం లాంటి సారెపై మట్టి ముద్ద తిరుగుతుంటే చేతితో అందమైన రూపంలో కుండను చేస్తారు. మధ్యమధ్యలో కర్రతో సారెను తిప్పుకోవాల్సి వచ్చేది. ఇప్పుడు సారెను కర్రతో తిప్పే విధానానికి స్వస్తి పలికారు. విద్యుత్ మోటారుతో అవసరమైనంతసేపు తిరుగుతూనే వుంటోంది. దీనితో పాత్రల తయారీకి సమయం తగ్గింది. ప్రమిదెల తయారీకి సెరామిక్ బ్లాంకెట్ వాడుతున్నారు.

కుండలకు తగ్గిన గిరాకీ

ఎంత కళాత్మకంగా మట్టి పాత్రలు చేసినా మార్కెటింగ్‌లో నష్టపోతున్నామనే భావన వీరిలో ఉంది. అదేమంటే వినియోగదారులు ‘మట్టి కుండేగా’ అనేస్తున్నారని వృత్తిదారులు వాపోతున్నారు. మట్టి కుండ తయారీకి సగటున రూ.70-80 ఖర్చయితే, వీరి నుంచి రూ.120 కొనుగోలు చేస్తున్నారు. మార్కెట్‌లో అదే కుండను రూ.250లకు అమ్ముతున్నారు. తయారీదారుకు రూ.50 లోపు మిగిలితే మధ్య వ్యాపారికి రూ.100 పైగా లభిస్తోంది. ఫ్రిజ్‌ల కారణంగా కుండలకు గిరాకీ తగ్గిన విషయం తెలిసిందే. ఆ తర్వాత కూలింగ్ క్యాన్లు వీరి వృత్తికి చేటుతెస్తున్నాయి. వేసవిలో విస్తృతంగా నడిచే చలివేంద్రాల్లో గతంలో కుండల స్థానంలో ఇప్పుడు కూలింగ్ వాటర్ క్యాన్లు వెలుస్తున్నాయి. ఈ క్యాన్ల నీటికన్నా కుండల నీరే శ్రేష్ఠమని తెలిసినా, అవే వాడుతున్నారు.

మట్టి పాత్రల తయారీలో మూడో తరం



కుండల తయారీలో మాది మూడోతరం. నేను 30 ఏళ్లుగా ఈ వృత్తిలో ఉన్నా. భార్య వెంకటరమణతో కలిసి వేసవిలో మట్టి పాత్రలను చేస్తుంటాను. ఇద్దరు కుమార్తెలు. పదోతరగతి వరకు చదివించి పెళ్లిళ్లు చేశాం. మా అల్లుళ్లు పాత్రలు చేయరు. మట్టి పాత్రల విక్రయం వ్యాపారంలో ఉన్నారు. మట్టి పాత్రల తయారీ గిట్టుబాటు కావడం లేదు. భవిష్యత్‌లో మా వారసులు ఈ వృత్తిలో ఉండరు.

– శాదరాజుపల్లి బోజిబాబు, వెంకటరమణ, గరువుపాలెం

గిట్టుబాటు కాని మార్కెట్ ధర



మట్టి పాత్రల వృత్తిలో నాది రెండోతరం. 30 ఏళ్లుగా కుండల తయారీలో ఉన్నాను. ఒక అబ్బాయి, ఒక అమ్మాయి. అమ్మాయిని ఇంటర్ వరకు చదివించి పెళ్లి చేశాను. అబ్బాయి డెయిరీలో పనిచేస్తున్నాడు. వృత్తిలో విద్యుత్ మిషన్లతో కొంత వెసులుబాటు వచ్చింది. ధర మాత్రం గిట్టుబాటు కావటం లేదు. మా ఇంటి నుంచి మూడో తరం ఈ వృత్తిలో లేనట్టే.

– బెజ్జంకి వీరభద్రరావు, గరువుపాలెం

నవీన్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

వైఎస్సార్ సీపీ వైద్యుల విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్



పిడుగురాళ్ల: సైప్రస్ దేశంలో కారు ప్రమాదంలో మృతి చెందిన గురజాల పట్టణానికి చెందిన నల్ల నవీన్ పార్థీవ దేహాన్ని ఇండియాకు తీసుకొచ్చేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకొని, వారి కుటుంబాన్ని ఆదుకోవాలని వైఎస్సార్ సీపీ వైద్యుల విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్ అన్నారు. శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉన్నత విద్యను అభ్యసించేందుకు గురజాల పట్టణానికి చెందిన నల్ల పేరయ్య కుమారుడు నల్ల నవీన్ సైప్రస్ దేశానికి వెళ్లాడన్నారు. దురదృష్టవశాత్తు కారు ప్రమాదంలో నవీన్ మృతి చెందటం జరిగిందన్నారు. ప్రభుత్వం స్పందించి పార్థీవ దేహం త్వరగా మనదేశం వచ్చేలా చూడాలని, అదేవిధంగా అతని కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

కూటమి నేతల తొత్తులుగా పోలీసులు..

మాజీ మంత్రి విడదల రజనీపై పోలీసులు చేసిన దాడిని డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్ తీవ్రంగా ఖండించారు. పోలీసులు దాడి చేయటం దుర్మార్గమన్నారు. పోలీసులు కూటమి నేతలకు తొత్తులుగా పని చేస్తున్నారని విమర్శించారు.

సీజీహెచ్‌ఎస్‌కు రేపు సెలవు

లక్ష్మీపురం: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు వైద్య సేవలు అందించే సీజీహెచ్ఎస్ (సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీం) వెల్‌నెస్ సెంటర్‌కు సోమవారం బుద్ధ పూర్ణిమ సందర్భంగా ప్రభుత్వం సెలవు ప్రకటించిందని గుంటూరు సీజీహెచ్ఎస్ ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ డి తుకారాం శనివారం తెలిపారు. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాలోని కార్డు హోల్డర్లంతా వైద్య పరీక్షల నిమిత్తం సోమవారం గుంటూరుకు రావద్దని ఆయన సూచించారు.

హోరాహోరీగా రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు



ఇంకొల్లు(చినగంజాం): గాదె వీరారెడ్డి మెమోరియల్ ఆధ్వర్యంలో ఇంకొల్లు మండలం పావులూరులో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలు సీజన్1లో శనివారం రెండు మ్యాచ్‌లు నిర్వహించారు. మొదటి మ్యాచ్‌లో ఉప్పుగుండూరు క్రిష్టియన్ యూత్ జట్టు, ఉప్పుగుండూరు అంబేడ్కర్ యూత్ జట్ల మధ్య నిర్వహించారు. టాస్ గెలిచిన క్రిష్టియన్ యూత్ జట్టు ఫీల్డింగ్ ఎంచుకోగా బ్యాటింగ్ చేసిన అంబేడ్కర్ యూత్ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 67 పరుగులు చేయగా తరువాత బ్యాటింగ్ చేసిన క్రిష్టియన్ యూత్ 7 ఓవర్లలో 68 పరుగులు చేసి విజయం సాధించింది. రెండో మ్యాచ్‌లో బ్యాటింగ్ చేసిన బొబ్బేపల్లి జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 73 పరుగులు చేయగా తరువాత బ్యాటింగ్ చేసిన దుద్దుకూరు ఫ్రెండ్స్ జట్టు 10 ఓవర్లలో 62 పరుగులు చేసి ఆల్‌అవుట్ అయింది.

16 కిలోల గంజాయి పట్టివేత

లక్ష్మీపురం: రైళ్ల ద్వారా వేరే రాష్ట్రాలకు గంజాయిని తరలించి అధిక లాభాలకు విక్రయిస్తున్న నిందితుడిని రైల్వే జీఆర్పీ పోలీసులు చాకచక్యంగా పట్టుకుని అరెస్ట్ చేశారు. అతడి నుంచి 16 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. జీఆర్పీ పోలీసులు శనివారం తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిసాకు చెందిన అజిత్‌కుమార్ జైన్, భోగా నాయక్‌లు అక్కడ గంజాయిని కొనుగోలు చేసి అధిక లాభాలకు గుజరాత్ రాష్ట్రంలోని సూరత్‌లో విక్రయించేందుకు రైలులో బయలుదేరారు. సమాచారం తెలుసుకున్న రైల్వే డీఎస్పీ పి.అక్కేశ్వరరావు, జీఆర్పీ సీఐ అంజిబాబు, ఐపీఎఫ్ సీఐ శంకరరావు, ఎస్ఐలు లక్ష్మీనారాయణ రెడ్డి, ఆర్పీఎఫ్ సిబ్బంది ఎం.శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, కానిస్టేబుళ్లు ఎం.సోమశేఖర్, జీ.వాసులు కలిసి గుంటూరు రైల్వేస్టేషన్ 1వ నంబర్ ప్లాట్‌ఫారంపై నిఘా పెట్టారు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో అజిత్‌కుమార్ జైన్‌ను జీఆర్పీ సీఐ అంజిబాబు సిబ్బందితో అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి 16 కేజీల గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. అజిత్‌కుమార్ జైన్‌తో పాటు భోగానాయక్ అనే వ్యక్తి ఉన్నాడని, అతడు పరారైనట్లు పోలీసులు వెల్లడించారు. అతడిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అజిత్‌కుమార్ జైన్‌పై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు.

సర్వేల పేరిట ఉద్యోగినులపై ఒత్తిడి తగదు

- కోటేశ్వరమ్మ మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలి
- సీఐటీయూ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మణిలాల్



ర్యాలీ నిర్వహిస్తున్న మెడికల్ అండ్ హెల్త్ ఉద్యోగులు, ఏఎన్ఎంలు

రేపల్లె: పట్టణంలో ఏఎన్ఎంగా పనిచేస్తూ బలవన్మరణానికి పాల్పడిన కోటేశ్వరమ్మ మృతిపై సమగ్ర విచారణ చేసి ఆమె కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బంది, ఏఎన్ఎంలు పట్టణంలో కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మణిలాల్ మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖలో మహిళా ఉద్యోగులపై పని ఒత్తిడి, వేధింపులు అధికం అవుతున్నాయని పేర్కొన్నారు. ఇంటింటి సర్వే, ఫోన్ సర్వే, యాప్ సర్వేల పేరుతో వేధింపులకు గురిచేస్తున్నారని తెలిపారు. ప్రతి ఉద్యోగి ఈ విషయంలో సాంకేతికపరంగా ఎదురవుతున్న సమస్యలపై సతమతమవుతున్నారని పేర్కొన్నారు. సర్వేల సమయంలో ఫోన్‌లు సక్రమంగా పనిచేయక, సకాలంలో పనులు పూర్తవ్వటం లేదని ఆవేదన చెందుతున్నారని తెలిపారు. సమీక్షల పేరుతో జిల్లా ఉన్నతాధికారుల నుంచి ఒత్తిడి పెరగటంతో మహిళా ఉద్యోగులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలకు చావు పరిష్కారం కాదని, పోరాటాల ద్వారా పరిష్కరించుకోవాలని చెప్పారు. మహిళా ఉద్యోగులపై సర్వేల పని ఒత్తిడి తగ్గించాలని డిమాండ్ చేశారు. కోటేశ్వరమ్మ మృతిపై అనుమానాలు ఉన్నట్లు బంధువులు పేర్కొంటున్నారని తెలిపారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ప్రభుత్వ వైద్యశాల నుంచి తాలూకా సెంటరు వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. కార్యక్రమంలో మెడికల్ ఉద్యోగులు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు 11 జీవాలు మృతి



గుమ్మనంపాడు గ్రామ పొలాల్లో మృతిచెందిన జీవాలు

బొల్లాపల్లి: పిడుగుపాటుకు గురై గొర్రెలు, మేకలు మృతిచెందిన సంఘటన మండలంలోని గుమ్మనంపాడు గ్రామ పొలాల్లో శనివారం జరిగింది. గ్రామానికి అల్లగండి చెరువు వీరనాయకులు గుడి వద్ద ఈదురుగాలులతో కూడిన వర్షంలో పిడుగు పడటంతో గొర్రెలు, మేకలు 11 మృత్యువాతకు గురయ్యాయి. గ్రామానికి చెందిన గోపినాయక్, కె.నాగయ్యలతో పాటు మరికొందరు రైతులకు చెందిన 11 జీవాలు మృతిచెందాయి. వీటివిలువ సుమారు రూ.1.50లక్షల నుంచి రూ.2లక్షల వరకు ఉంటుందని బాధితులు చెప్పారు. ఘటనా ప్రాంతాన్ని గుమ్మనంపాడు పశువైద్యుడు బి.సాల్మన్‌సింగ్ పరిశీలించి ఆయా జీవాల యజమానుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకే పల్లెనిద్ర

రేపల్లె డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు



రేపల్లె: శాంతి, భద్రతల పరిరక్షణతోపాటు ప్రజలతో మమేకమై పనిచేసేందుకు పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రేపల్లె డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు చెప్పారు. పల్లెనిద్ర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రాత్రి పట్టణంలోని 18వ వార్డులో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వార్డులో ఎటువంటి సమస్యలు తలెత్తినా శాంతియుతంగా పరిష్కరించుకోవాలన్నారు.